
క్లుప్తంగా

శనిత్రయోదశి ప్రత్యేక పూజలు



నందిగామ: శని త్రయోదశి సందర్భంగా శనివారం నందిగామలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, రామలింగేశ్వర్‌నగర్ అయ్యప్పస్వామి ఆలయప్రాంగణంలోని శనైశ్వరునికి, గాంధీనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని నవగ్రహ మండపం వద్ద భక్తులు శనేశ్వరుడికి ప్రత్యేక తైలాభిషేకాలు చేశారు. పట్టణ శివారు పల్లగిరి కొండపై ఉన్న నవగ్రహ మండపం వద్ద, దాములూరు కూడలి, సోమవరం, గోళ్ళమూడి, మాగల్లు గ్రామాల్లోని శివాలయాల్లో నవగ్రహ మండపాల వద్ద శనిత్రయోదశి పూజలు నిర్వహించారు. ఆయా శివాలయాలను పెద్దసంఖ్యలో భక్తులు సందర్శించి పూజలు చేశారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులచే నిర్వహించిన మాక్‌పోలింగ్ ఆకట్టుకుంది. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కు వినియోగంపై నాలుగు, ఐదోతరగతి విద్యార్థులకు మాక్‌పోలింగ్ ద్వారా శనివారం అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్సు ఏర్పాటు చేసి ఓటరు తన ఓటును ఎలా వేస్తారు అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

కంచికచర్ల : రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతిచెందాడు..ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు..మండలంలోని కీసర గ్రామానికి చెందిన సంగం చంద్రశేఖర్(24)అనే యువకుడు ఈనెల 19న బైక్‌పై వెళ్తూ కీసర మునేటి సమీపంలో ప్రమాదవశాత్తు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబసభ్యులు వైద్యచికిత్స కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చంద్రశేఖర్ శనివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మసీదు కమిటీకి షాపు అప్పగింత

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని జామియా మసీదు షాపింగ్ కాంప్లెక్స్‌లోని సీ–3 నంబరు షాపును మసీదు కమిటీ శనివారం స్వాధీనం చేసుకుంది. ఈసందర్భంగా జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ షేక్ జలీల్ మాట్లాడుతూ సీ–3 నంబరు షాపును అద్దెకు తీసుకున్న వ్యక్తి పదేళ్లుగా అద్దె చెల్లించక పోవడంతో రూ.4లక్షల వరకు అద్దె బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఈవిషయంపై వక్ఫ్ బోర్డుకు ఫిర్యాదు చేయడంతో ఈనెల ఏడోతేదీన వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్లు వచ్చి సదరు షాపునకు తాళం వేయగా, సదరు షాపు నిర్వాహకుడు మరుసటిరోజు వచ్చి ఆ తాళం పగులగొట్టి తాను మరో తాళం వేసుకుని వెళ్లాడని తెలిపారు. ఈవిషయంపై తాము స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులు శనివారం వచ్చి ఆ తాళం తొలగించి షాపును స్వాధీనం చేసినట్లు జలీల్ వివరించారు.

వినతిపత్రం అందజేత

జగ్గయ్యపేట అర్బన్: తమ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వడ్డేపూడి ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు తమ డిమాండ్లను తెలియజేస్తూ సమితి ఆధ్వర్యంలో ఓ వినతిపత్రాన్ని ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు అందజేసేందుకు వారు శనివారం ఆయన ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఉదయభాను అందుబాటులో లేకపోవడంతో ఆయన సతీమణి, విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభానుకు ఆ వినతిపత్రాన్ని అందజేశారు. తమ డిమాండ్లను వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టేలా ఎమ్మెల్యే ఉదయభాను కృషిచేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సభ్యులు గోనె విజయలక్ష్మి, వడ్డేపూడి అచ్చయ్య, చీకటిమల్ల రామకృష్ణ, కొండపల్లి కోటేశ్వరరావు, అమ్మనబోయిన నాగరాజు,గుడిపూడి శ్రీనివాసరావు, రవి, శ్రీనివాస్, హరి, పూర్ణ, నరసింహారావు, కిరణ్ పాల్గొన్నారు.

జయంతోత్సవాలు

నందిగామ: మండలంలోని మాగల్లు వైకుంఠ నారాయణ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలోని స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో స్వామివారిని హనుమంతుని వాహనంపై ఊరేగించారు.

ప్రగతిపథంలో మంగొల్లు

- రూ.3.09కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు
- సచివాలయం, ఆర్బీకే. హెల్త్‌క్లీనిక్ ఏర్పాటు
- 7ఎకరాల్లో 260మంది పేదలకు ఇళ్లస్థలాలు
- రూ. కోటితో పాఠశాలల అభివృద్ధి
- డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా గ్రామస్తులకు రూ.32.35కోట్ల లబ్ధి

మంగొల్లు(వత్సవాయి) : గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన మంగొల్లు గ్రామం..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రగతిపథంలో పయనిస్తోంది. జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో గ్రామంలో మౌలిక వసతులు మెరుగయ్యాయి.

రూ.81లక్షలతో సచివాలయం, ఆర్బీకే..

సచివాలయ వ్యవస్థ ద్వారా పేదలకు గ్రామంలో మెరుగైన సేవలు అందిస్తున్న రాష్ట్రప్రభుత్వం మంగొల్లులో రూ.81లక్షలతో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ను నిర్మించింది. గతంలో ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణపత్రాల కోసం పనులు మానుకుని మండల కేంద్రం వత్సవాయికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. సచివాలయ వ్యవస్థ వచ్చాక గ్రామ పొలిమేర దాటకుండానే ఆయా ధ్రువీకరణపత్రాలు అందుతుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు..

పేద ప్రజల పిల్లలకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పాఠశాలల అభివృద్ధి చేపట్టింది. ఈ కార్యక్రమం కింద గ్రామంలోని జెడ్పీ, ఎంపీపీ పాఠశాలలకు కోటిరూపాయల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా పాఠశాలలో అదనపు తరగతి గదులు, ఎంపీపీ విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, పెయింటింగ్స్, గ్రీన్ చాక్‌బోర్డు ఏర్పాటుతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు కల్పించారు.

రూ.70లక్షలతో సీసీరోడ్లు..

గ్రామంలోని ఎస్సీ, బీసీ ఏరియాల్లో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తిచేశారు. రూ.30 లక్షలతో మురుగునీరు పారేందుకు వీలుగా డ్రైనేజీలు నిర్మించారు.

రూ.59లక్షలతో సొసైటీ అభివృద్ధి..

గ్రామంలోని శ్రీ సీతారామ ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘాన్ని అభివృద్ధి పరిచారు. రూ.59లక్షలతో సొసైటీకి నూతనంగా క్యాష్ కౌంటర్ ఏర్పాటుతోపాటు నూతన కార్యాలయం, గొడౌన్, కార్యాలయం చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేశారు.



మంగొల్లులోని సచివాలయ భవనం

ఐదేళ్లలో గ్రామస్తులకు రూ.32.35కోట్ల లబ్ధి..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పదినెలల పాలనా కాలంలో ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయా పథకాల కింద మంగొల్లు గ్రామానికి కోట్లాది రూపాయల లబ్ధి చేకూరింది. డీబీటీ, నాన్‌డీబీటీ రూపంలో రూ.32.35కోట్ల లబ్ధి చేకూరిందని మంగొల్లు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

260 మందికి ఇళ్ల పట్టాలు..

గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలు 260మందికి ఉండగా వీరికి ఏడెకరాల స్థలంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఉచితంగా ఇళ్లస్థలాలు, ఇళ్ల మంజూరు చేశారు. వీరిలో కొందరు ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు కూడా చేయగా, మరికొందరి ఇళ్ల నిర్మాణాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఆయా ఇళ్లస్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుండటంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

అభివృద్ధిలో ముందంజ..



గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో పేదలకు ఇంటి స్థలాల పంపిణీ, సచివాలయ భవనాల నిర్మాణం నాడు–నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి చెందాయి. సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాం.

– అన్నెపాక ప్రణీత, సర్పంచి

అభివృద్ధికే ప్రజల మద్దతు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే ఉదయభాను ప్రత్యేక చొరవతోనే మంగొల్లు ఇంతలా అభివృద్ధి చెందింది. అభివృద్ధి చేసే ప్రభుత్వానికి గ్రామస్తులమంతా అండగా ఉంటాం.

– సామినేని లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షులు



రైతుభరోసా కేంద్రం



మంగొల్లు జగనన్నకాలనీలోని ఇళ్లు




సొసైటీ భవనం

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

నందిగామ టౌన్: నందిగామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆదివారం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ జగన్‌మోహనరావు ఆదివారం ఉదయం 8.32 గంటలకు నందిగామ పట్టణంలో వేంచేసియున్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అనంతరం 10.59గంటలకు చందర్లపాడు మండలం రామన్నపేట గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కోరారు. సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట):గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ ఎన్వి శివప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా గ్రామాలలో ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే కూలీలకు తాగునీరు, ఎండవేడిమి తట్టుకునేందుకు టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం ఐదు గంటల నుంచి 10.30 గంటల వరకు పని చేయాలని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు గుంతలు పూడ్చటం, కంప చెట్లు తొలగించడం తదితర పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్ల నమోదు విషయంలో నిస్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామాల వారీగా రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అధికారులు కుచేలుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వీరులపాడు: ఎన్నికల నియమావళిని అన్ని రాజకీయపార్టీల నాయకులు, కార్యకర్తలు తప్పకుండా పాటించాలని తహసీల్దార్ రాజకిషోర్ సూచించారు. మండలంలోని వెల్లంకి, కొణతాలపల్లి గ్రామాల్లోని రాజకీయ పార్టీల దిమ్మెలు, జెండాలు, నాయకుల విగ్రహాలకు రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది శనివారం ముసుగులు వేశారు. ఈసందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా అందరూ నడుచుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిలా రాజకీయపార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలని ఆదేశించారు.ఎంపీడీవో లక్ష్మీదేవి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌కు కట్టుబడి ఉండాలి

కంచికచర్ల : అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కోడ్‌కు కట్టుబడి ఉండాలని తహశీల్దార్ సుస్వాగతం సూచించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లోని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను సచివాలయ సిబ్బంది శనివారం తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు కూడా ముసుగులు వేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లఘించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దిమ్మెలకు ముసుగు వేస్తున్న అధికారులు

పౌష్టికాహారంతో తల్లీబిడ్డకు ఎంతో మేలు



అవగాహన కల్పిస్తున్న వెంకటరామమ్మ



పెనుగంచిప్రోలులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

నందిగామ: తల్లి పోషకాహారం తీసుకుంటే బిడ్డలు కూడా ఎంతో ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటరామమ్మ పేర్కొన్నారు. పోషణ్ అభియాన్ ముగింపు వేడుకలు శనివారం మండలంలోని అడవిరావులపాడులో నిర్వహించారు. తొలుత గ్రామంలో ఐసిడిఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోషకాహారం ప్రాధాన్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకటరామమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఐసిడిఎస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

పెనుగంచిప్రోలు: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా చిరుధాన్యాలు తినటం ద్వారా కలిగే లాభాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైద్యసేవలు, ప్రభుత్వం ద్వారా అందించే పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు కూడా మంచి ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సచివాలయ సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

మొదలైన తిరునాళ్ల సందడి



ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న జెయింట్ వీల్, ఎగ్జిబిషన్



ఆలయం వద్ద ఆయా డిపార్ట్‌మెంట్ల కోసం ఏర్పాట్లు చేసిన టెంట్లు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసిమెన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి చిన తిరునాళ్ల ఉత్సవాల సందడి మొదలైంది. మార్చి 25 నుంచి 29వ తేదీవరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం వద్ద చిన్నా, పెద్దా అందరికీ వినోదాన్ని పంచే ఎగ్జిబిషన్‌లో జెయింట్‌వీల్, మ్యాజిక్‌షోలు, రకరకాల దుకాణాలు సిద్ధమవుతున్నాయి. మునేరులో భక్తులు స్నానాలు చేసేందుకు షవర్‌బాత్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. మునేరులో భక్తులు సేదతీరేందుకు ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వద్ద తాత్కాలిక సమాచార కేంద్రంతో పాటు వివిధ డిపార్ట్‌మెంట్ల కోసం ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు కూడళ్ల వద్ద స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

జగ్గయ్యపేట: మండలంలోని తక్కెళ్ళపాడు, బలుసుపాడు గ్రామాల్లో చిల్లకల్లు పోలీసులు శనివారం రాత్రి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ మాట్లాడుతూ కొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలు ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీని వీడి సొంతగూటికి కౌన్సిలర్



కౌన్సిలర్ వాణి, కృపారావు, జయరామారావులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న పార్టీ ఎన్నికల పరిశీలకుడు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నందిగామ టౌన్: వైఎస్సార్‌సీపీని వీడి శుక్రవారం టీడీపీలో చేరిన నందిగామ తొమ్మిదోవార్డు కౌన్సిలర్ విశ్వనాథపల్లి వాణి తన అనుచరులతో కలిసి తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి శనివారం రాత్రి తొమ్మిదోవార్డు కౌన్సిలర్ వాణి, వార్డు కన్వీనర్ విశ్వనాథపల్లి కృపారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పత్తిపాటి జయరామారావులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని వీడిన ఓ మాయలఫకీరు మాయమాటలు నమ్మి టీడీపీలో చేరినవారు తాముమోసపోయామని గ్రహించి, తిరిగి సొంత గూటికి చేరారన్నారు. ఎవరు ఎంత ప్రయత్నించినా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రలోభపెట్టలేరన్నారు. నిత్యం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ నీతిమాలిన పనులకు పాల్పడుతున్న సదరు మాయలఫకీరు ఇకనైనా అటువంటి పనులు మానుకోవాలని సూచించారు. ప్రజల మద్దతుతో గెలవలేక అధికార పార్టీ కౌన్సిలర్లను డబ్బులకు కొనుగోలు చేసి దొడ్డిదారిన మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని టీడీపీ నాయకులు కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. అడ్డదారుల్లో అధికారం పొందడం టీడీపీ నేతలకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అఖండ విజయాన్ని సాధించబోతుందని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జిత్తులమారి చంద్రబాబు ఎన్నిపొత్తులతో వచ్చినా రానున్న ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమన్నారు. ప్రజల మనిషి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజలంతా అండగా ఉండి మరోసారి గెలిపిస్తారన్నారు. అధికారమే లక్ష్యంగా అడ్డదారులు తొక్కుతున్న టీడీపీ నేతలకు మరోసారి బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు.

తిరిగి పార్టీలోకి రావడం సంతోషంగా ఉంది..

కొందరి మాయమాటలు విని తొందరపాటు నిర్ణయం తీసుకున్నామని, అయితే తిరిగి వైఎస్సార్ సీపీలోకి రావడం సంతోషంగా ఉందని తొమ్మిదో వార్డు కౌన్సిలర్ వాణి, వార్డు ఇన్‌చార్జి కృపారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జయరామారావు పేర్కొన్నారు. టీడీపీలో చేరడం దురదృష్టకర సంఘటన అని అభివర్ణించారు. రానున్న ఎన్నికల్లో నందిగామ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విజయానికి కృషిచేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, గుడివాడ సాంబశివరావు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘననివాళి



చిల్లకల్లులో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమల్‌కుమార్, లక్ష్మీసుజాత, విద్యార్థులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విప్లవవీరుడు భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వంచారు. భగత్‌సింగ్ చిత్రపటానికి ఎంపీడీవో రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో భగత్‌సింగ్ చేసిన త్యాగాలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. కార్యదర్శి జగ్గయ్య, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

జగ్గయ్యపేట అర్బన్: స్వతంత్ర్య సమరయోధులు, విప్లవకారులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని పట్టణంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బలుసుపాడురోడ్డులోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎస్ఎఫ్ఐ నాయకులు కమల్‌కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం కోసం జరిగిన స్వాతంత్రోద్యలో వీరోచితంగా పోరాడి తన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ అన్నారు. వారి త్యాగాలను భావితరాలు స్ఫూర్తిగా తీసుకొంటాయన్నారు. గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీసుజాత, విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వత్సవాయమ్మ తిరునాళ్ల



వత్సవాయి : గ్రామంలో వేంచేసియున్న శ్రీరామ జగపతి దేవసమేత శ్రీ వత్సవాయమ్మ తల్లి తిరునాళ్ల ఆదివారం నుంచి ఐదు రోజులుపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శిరీష తెలిపారు. తిరునాళ్లలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారి కల్యాణం, సోమవారం మధ్యాహ్నం జలబిందెలు, రాత్రికి అంకసేవ, మంగళవారం రాత్రి పూలకప్పెర, ఊరేగింపు, బుధవారం పొరుగూరి బోనాలు, రాత్రికి గ్రామరాశిప్రభ ఊరేగింపు, చివరిరోజు గురువారం ఉదయం నుంచి గ్రామ బోనాలతోపాటు, రాత్రికి దీవెన బండారు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. తిరునాళ్ల సందర్భంగా రెవెన్యూ, వైద్యశాఖ, పోలీస్‌శాఖలతో సమీక్షలు నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకుని తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd. [illegible] ... Ack Due ద్వారా ... [illegible]

దాయపనేని శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్. 98484 13820
Enrolment Number: 1370/1987

తేది.23-03-2024